



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతీఒక్కరు కృషిచేయాలి

- ఇందిరమ్మ ఇళ్లు, వనమహోత్సవం, సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సమీక్ష

నిజామాబాద్అర్బన్,జూలై5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలను పకడ్బందీగా అమలుచేస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్‌వ్యాధులు, నివేషన స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు, హౌజింగ్ ఏఈలు, ఐకేపీ ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారిగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షిస్తూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని లబ్ధిదారులకు ఐకేపీ మెప్మా ద్వారా అవసరమైన రుణాలు మంజూరు చేయిస్తూ ఇళ్ల నిర్మించేలా ప్రోత్సహించాలన్నారు. గత రెండు వారాలతో పోలిస్తే ఇళ్ల నిర్మాణాలలో ప్రగతి కనిపిస్తున్నా మరింత పురోగతి సాధించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉన్నందున తప్పనిసరిగా ప్రతీ గ్రామ పంచాయతీల్లో, నివాస ప్రాంతాల్లో ముందస్తుగానే నియంత్రణ చర్యలు చేపట్టాలని క్రమం తప్పకుండా వాగింగ్ చేయాలన్నారు. మంచినీటి వనరులలో గంబూషియా చేపపిల్లలను వదలాలని మత్స్యశాఖ ద్వారా చేపపిల్లలను సమకూర్చుకోవాలన్నారు. ఎక్కడైనా మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు వంటి పాజిటీవ్ కేసులు నమోదైతే సత్వరమే పరిసర ప్రాంతాల్లో అవి సోకకుండా చూడాలన్నారు. ప్రతీ ఫ్రైడే డ్రైడే అమలు చేయాలన్నారు. వన మహోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈ ఏడాది 51.11 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యమన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపుకలెక్టర్ అంకిత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవోశ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజశ్రీ ఉన్నారు.



వీసీ పాల్గొన్న అధికారులు

- ఇప్పటికే బూత్ కమిటీల నుంచి నియోజవకర్గాల వరకు సమావేశాల నిర్వహణ
- పోటీపై క్యాడర్, నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం
- రిజర్వేషన్ల ప్రకటన తర్వాతే పోటీ చేసేలా కాంగ్రెస్, బీజేపీ నేతల ఏర్పాట్లు
- ఇంకా కసరత్తు చేయకపోవడంతో ఆందోళనలో బీఆర్ఎస్ పార్టీ నేతలు
- ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఉంటే పోటీకి సై అంటున్న ఆ పార్టీ నేతలు



'స్థానిక' ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీజేపీ!

నిజామాబాద్,జూలై5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామ, బూత్‌స్థాయిల్లో సమావేశాలు నిర్వహించడంతోపాటు మెజార్టీ పంచాయతీలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించేశారు. ఆయా గ్రామాల పరిధిలో రిజర్వేషన్లకు అనుగుణంగా బలమైన నేతలను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేలా ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. మండల నియోజకవర్గ స్థాయిలో పలు సమావేశాలను నిర్వహించిన పార్టీ నేతలు ఎన్నికలు ఎప్పుడు జరిగినా పోటీకి సిద్ధమయ్యారు. జిల్లాలో పదేళ్లపాటు స్థానిక సంస్థల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, మండల అధ్యక్షులతోపాటు జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఇప్పటివరకు ఇంకా ఎలాంటి ప్రయత్నాలు మొదలు పెట్ట లేదు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ఎన్నికలపై సమావేశాలు నిర్వహించడం లేదు. బూత్ స్థాయిలో నేతలను కలుపుకుని ఎన్నికలకు గట్టి పోటీ ఇచ్చేలా దిశానిర్దేశం చేయడంలేదు. రెండు పార్టీల నేతలు ఎన్నికలే ఎజెండాగా ముందుకు పోతుండగా బీఆర్ఎస్‌లో ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులుగా ఉన్న నేతలతో పాటు పోటీకి సన్నద్ధమవుతున్న శ్రేణులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ, మండలస్థాయిలో తమ వర్గాలను కాపాడుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్నికల దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఎన్నికలు మొదట నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల తర్వాత ప్రధాన మున్సిపాలిటీల్లో ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఏడాదిన్నర నుంచి పాలకవర్గాలు లేవు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో పాలకవర్గాల పదవీకాలం పూర్తయి ఏడాది గడిచిపోయింది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు అన్ని ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. గ్రామ పంచాయతీల నుంచి జడ్పీ వరకు పాలకవర్గాలు లేక కేంద్రం నుంచి గ్రామాలకు నిధులు రావడం లేదు. ఈ ఎన్నికలు నిర్వహించేంత వరకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ఈ ఎన్నికలకు సిద్ధమతోంది. రిజర్వేషన్లను ప్రకటించడం తోపాటు త్వరలోనే ఎన్నికలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

పోటీ చేసేందుకు అధికార పార్టీ నేతలు

ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా పోటీకి అధికార పార్టీ నేతలు సిద్ధమంటున్నారు. పదేళ్లపాటు పదవులకు దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్, జూనియర్ నేతలు ఈ ఎన్నికల్లో రిజర్వేషన్‌కు అనుగుణంగా తమ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు సిద్ధమవుతున్నారు. పంచాయతీల నుంచి జడ్పీ వరకు మెజార్టీ స్థానాల్లో ప్రాతినిధ్యం ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికలపై దృష్టి పెట్టి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఆ పథకాలన్నీ తమకు కలిసివస్తాయని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు గడిచిన కొన్నినెలలుగా గ్రామాల్లో తమ వర్గాలను ఏర్పాటు చేసుకున్నారు. అప్పటినుంచి కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొంటూ ప్రభుత్వ పథకాల అమలులో ముందుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర సీనియర్ నేతల ఆదేశాలకు అనుగుణంగా గ్రామ, మండలస్థాయిల సమావేశాలను పార్టీ నేతలు నిర్వహించారు. నియోజకవర్గ సమావేశాలను పూర్తిస్థాయిలో నిర్వహించడంతోపాటు ఎన్నికల కోసం సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ పోటీకి సన్నద్ధమవుతున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభలో కూడా ప్రతీ గ్రామం నుంచి అధ్యక్షుడితో పాటు బూత్ కమిటీ సభ్యులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలే ఎజెండాగా జరుగుతున్న ఈ సభను ఉపయోగించుకుని మరింత ముందుకుపోయేందుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్‌లు అనుకూలిస్తే గ్రామ, మండలస్థాయిలో ఎక్కువమంది పోటీ చేయనున్నారు.

ఎన్నికలే ఎజెండాగా..

'స్థానిక' ఎన్నికలే ఎజెండాగా బీజేపీ నేతలు కూడా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఈ దఫా పంచాయతీలు, జడ్పీలో పాగా వేసేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వీటితోపాటు ప్రధాన మున్సిపాలిటీలపై దృష్టి పెట్టి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత ఆరు నెలలుగా బూత్ కమిటీల సమావేశాల నుంచి మండల, నియోజకవర్గ సమావేశాల వరకు నిర్వహించారు. అన్ని సమావేశాల్లో ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఎజెండగా ముందుకెళ్తున్నారు. బీజేపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిపట్టులేదు. గత ఎన్నికల్లో కొద్దిమందే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గెలుపొందారు. ఈ దఫా కీలక సీట్లను సాధించుకునేలా ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు, (మిగతా 8వపేజీలో..)

TRANSFERS

కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు

- కొత్తవారికి ఏడుగురికి పోస్టింగ్
- తొలిసారి మహిళా ఎస్‌హెచ్‌వోలుగా పోస్టింగ్

నిజామాబాద్ అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో (బాసర జోన్-2)లో పనిచేస్తున్న 14మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న ఏడుగురికి వివిధ పోలీస్ స్టేషన్‌లలో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఏడుగురికి వీఆర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. నిజామాబాద్ వీఆర్‌లో ఉన్న మహిళా ఎస్సైలకు తొలిసారి ఎస్‌హెచ్‌వోలుగా పోస్టింగ్ ఇచ్చారు. సిరికొండ ఎస్‌హెచ్‌వోగా మామిడిపల్లి కళ్యాణిని నియమించగా, మోపాల్ ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ సుమలతను నియమించారు. మెండోరా ఎస్‌హెచ్‌వోగా జాదవ్ సుహాసినిని నియమించారు. వీఆర్‌లో ఉన్న పడాల రాజేశ్వర్‌ను ఏర్గట్లకు, కిరణ్‌పాల్‌ను మూడవ టౌన్ రెండవ ఎస్సైగా, శైలేందర్‌ను బాల్కొండ ఎస్‌హెచ్‌వోగా, రామును ఎడపల్లి ఎస్‌హెచ్‌వోగా నియమించారు. సిరికొండ ఎస్‌హెచ్‌వో రాము, మోపాల్ ఎస్‌హెచ్‌వో యాదగిరి, ఎడపల్లి ఎస్‌హెచ్‌వో వంశీ కృష్ణ, మెండోరా ఎస్‌హెచ్‌వో యాసర్‌అరాఫత్, ఏర్గట్ల ఎస్‌హెచ్‌వో రాములును వీఆర్‌కు బదిలీ చేశారు. బాల్కొండ ఎస్‌హెచ్‌వో నరేష్, మోర్తాడ్ ఎస్ హెచ్‌వో విక్రమ్‌లను ఆదిలాబాద్ వీఆర్‌కు అటాచ్ చేశారు.

నేడే మొహరం

నిజామాబాద్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో మొహరం పండుగను ఆదివారం జరుపుకోనున్నారు. ముస్లింల క్యాలెండర్ ప్రకారం మొహరం తొలిరోజుగా భావిస్తారు. ఈరోజున ప్రత్యేక ప్రార్థనలతో పాటు 9 రోజుల పాటు వివిధ రూపాల్లో దానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. చివరిరోజైన మొహరం రోజున పీర్లను వీధులగుండా ఊరేగిస్తూ ఉత్సవాన్ని జరుపుతారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ డిపో-2 నుంచి ప్రత్యేక బస్సు

- పండరిపూర్, తుల్జాభవాని దర్శనానికి ప్రత్యేక బస్సు

సుభాష్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భక్తులను ఆకట్టుకునేందుకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రవేశపెట్టింది. తీర్థయాత్రల కోసం సౌకర్యాలను కల్పిస్తూ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. సూపర్‌లగ్జరీ బస్సులలో కేవలం ఒక్కొక్కరికి రూ. 2400 చెల్లించి పండరిపూర్ - విఠలేశ్వరస్వామి - తుల్జాపూర్ భవానిమాత - గాణాగాపూర్ దత్తాత్రేయస్వామి - బీదర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను దర్శించుకోవచ్చని ఆర్టీసీ డిపో-2 మేనేజర్ సాయన్న తెలిపారు. ఈ తీర్థయాత్ర జూలై 9న సాయంత్రం 7గంటలకు బయలుదేరి జూలై 12 ఉదయం 6గంటలకు తిరిగి నిజామాబాద్ చేరుకుంటుందని తెలిపారు. ఈ పవిత్ర యాత్రలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రశాంతత పొందాలని డిపో మేనేజర్ సాయన్న కోరారు. ఆసక్తిగల భక్తులు 9959226017, 7382845603, 866649129 నెంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.



ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం

- రైతు వేదికల నిర్మాణాలను చూసి నివ్వెరపోతున్న రైతులు
- కామారెడ్డి జిల్లాలో 80 శాతం భవనాలు నిరుపయోగమే..

వివరాలు 7లో....

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వాటా మేరకు వెచ్చించాలి : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నిజామాబాద్ అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. నిజామాబాద్ సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసుల్లో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని నిధుల దుర్వినియోగం అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు హితవు పలికారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పనిచేయాలని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై మాసం నుంచి కార్యచరణ రూపొందించుకొని ప్రతీనెల చివరి శనివారం పౌరహక్కుల దినాన్ని నిర్వహించి తహశీల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా మూడు నెలలకోసారి డీవీఎంసీ సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల (మిగతా 8వపేజీలో..)



విజ్ఞాపనలను స్వీకరిస్తున్న చైర్మన్



సమావేశానికి హాజరైన అధికారులు

National Food Security Cards
Government of Telangana



తిప్పలైనా తీసుకున్నారు!

- జిల్లాలో 96.99 శాతం సన్న బియ్యం పంపిణీ
- 3లక్షల 78వేల 95 మంది కార్డుదారులకు పూర్తయిన పంపిణీ
- యాడింగ్‌లో కొత్త సభ్యులకు అందిన రేషన్
- కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులకు దక్కని అవకాశం

నిజామాబాద్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు నెలల కోటా బియ్యం పంపిణీ జిల్లాలో విజయవంతమైంది. రికార్డు స్థాయిలో లబ్ధిదారులు తమ కోటాకు సంబంధించిన బియ్యాన్ని రేషన్‌షాపుల నుంచి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 96.99శాతం మంది లబ్ధిదారులు తమ కోటా రేషన్ బియ్యాన్ని తీసుకున్నారు. ప్రభుత్వం మొట్టమొదటి సారిగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టి ఒకే సారి మూడు నెలల కోటాను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయం తీసుకుంది. మూడు నెలలకు సంబంధించిన రేషన్ పంపిణీ గత సోమవారం ముగిసింది. నూతన విధానంలో రేషన్ షాపుల ద్వారా మూడు నెలల కోటాను పంపిణీ చేయ గా మొదట్లో కొంత ఇబ్బంది కలిగిన తర్వాత సాఫ్ట్‌వేర్ మార్పుతో విజయవంతంగా జిల్లాలో బియ్యం పంపిణీ పూర్తి అయ్యింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 4లక్షల 3వేల 510 కార్డుదారులు ఉండగా జిల్లా వ్యాప్తంగా 3లక్షల 78వేల 95 మంది కార్డుదారులు రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లారు. కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు మొదట్లో తలెత్తినప్పటికీ జిల్లాలో మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ సాఫీగా జరిగింది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వడంతో ఈపాస్ యంత్రాల ద్వారా మూడు నెలల కోటా ఇచ్చేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారు. గతంలో ఒకేసారి వేలిముద్ర తీసుకునే రేషన్ షాపు నిర్వాహకులు కొత్త సాఫ్ట్‌వేర్ వల్ల ఒక్కో నెలకు కేంద్రం వాటా, రాష్ట్రం వాటా కోసం మూడు మూడు సార్లు వేలిముద్రలు తీసుకున్నారు. మొదట్లో ఈ విధానం వల్ల గంటలు గంటలు రేషన్ కార్డుదారులు రేషన్ షాపుల ముందు క్యూలు కట్టే పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంటలు గంటలు రేషన్ కార్డుదారులు వేచి ఉండి తమ కోటాను తీసుకున్నారు.

తిప్పలైనా తప్పలేదు

జిల్లాలో మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కోసం రేషన్ దుకాణాల ఎదుట కార్డుదారులు గంటల తరబడి వేచి ఉన్నారు. ఒక్కొక్కరికి 18 కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి బియ్యం పంపిణీ చేశారు. ఐదుగురు సభ్యులున్న కార్డుదారులకు 90 కిలోల బియ్యం రాగా ఆపై కుటుంబ సభ్యులున్న కార్డుదారులకు క్వింటాలు పైనే బియ్యం వచ్చింది. సాంకేతిక కారణాల వల్ల ఇబ్బంది పడ్డ కార్డుదారులు క్వింటాలు పైనే బియ్యం తీసుకెళ్లేందుకు కూడా నానా ఇబ్బందులు పడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం నుంచి మూడు నెలల కోటా పంపిణీకి సంబంధించి సన్న బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకున్నారు. గతంలో రేషన్ బియ్యం పంపిణీ 80 శాతంలోపే జరుగగా మూడు నెలల కోటా మాత్రం 96 శాతంకు పైగా నమోదు కావడం సన్నబియ్యం పంపిణీయే కారణం అని అధికారులు చెబుతున్నారు. పేదలు, మధ్యతరగతి వారు సైతం రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపారు. దీంతో రికార్డు స్థాయిలో బియ్యం పంపిణీ సాధ్యమైంది.

కొత్త కార్డుదారులకు తప్పని నిరాశ

ఇటీవల ప్రభుత్వం నూతన రేషన్ కార్డులతో పాటు కొన్ని కార్డులలో కొత్త మెంబర్ల యాడింగ్ చేసినప్పటికీ మూడు నెలల కోటాకు సంబంధించిన బియ్యం అందలేదు. జూన్ నెలకు సంబంధించి నూతన కార్డులు ఆమోదించిన వారికి సంబంధించిన కోటా విడుదల కాకపోవడంతో మూడు నెలల కోటాలో వారికి బియ్యం పంపిణీ కాలేదు. జిల్లాలో 10వేలకు పైగా కొత్త కార్డుల ఆమోదం పొందగా మెంబర్ యాడింగ్‌కు సైతం వేలల్లో దరఖాస్తులు వచ్చి ఆమోదం పొందాయి. కానీ వీరికి సంబంధించిన రేషన్ కోటా రాకపోవడంతో వారంతా నిరాశ చెందారు. వీరికి సెప్టెంబర్‌కు సంబంధించిన కోటాలో బియ్యం వచ్చే అవకాశం ఉంది.

కళాశాలల మరమ్మతులకు రూ.3.23 కోట్ల మంజూరు

- డీఐఈవో రవికుమార్

నిజామాబాద్అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల మరమ్మతులు, మంచినీటి వసతి, కరెంటు రిపేర్‌లు, ఇతర కనీస వసతుల కోసం రూ.3కోట్ల 23లక్షల 1000 మంజూరు అయినట్లు డీఐఈవో రవికుమార్ శనివారం తెలిపారు. రాష్ట్ర ఇంటర్‌బోర్డు కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రూ.30లక్షలు, బాలుర జూనియర్ కళాశాలకు రూ.56లక్షలు, డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.14లక్షలు, మాక్లూర్ ప్రభుత్వ జూనియర్‌కళాశాలకు 10లక్షలు, మోర్తాడ్ ప్రభుత్వజూనియర్ కళాశాలకు రూ.26లక్షల 35వేలు, వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.20లక్షల 50వేలు, బోధన్ మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.10లక్షల 70వేలు, ఆర్మూర్ బాలికల జూనియర్ కళాశాలకు రూ.16లక్షలు, ఆర్మూర్ బాలుర జూనియర్ కళాశాలకు రూ.24లక్షలు, భీంగల్ జూని యర్ కళాశాలకు 18లక్షలు, ఐలాపూర్ జూనియర్ కళాశాలకు 9లక్షలు, బాల్కొండ జూనియర్ కళాశాలకు 33లక్షల 5వేలు, ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 25లక్షలు, కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 30లక్షల 50వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు. తెలిపారు.

కార్మికుల బకాయి వేతనాలపై ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తా

● ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



బోధన్‌లో నిజాంషుగర్స్ కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

బోధన్‌రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాల కోసం తమ పార్టీ ఎంఐఎం ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో మాట్లాడిస్తానని, కార్మికుల తరపున పోరాడుతామని ఎంఐఎం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హామీ ఇచ్చారు. శుక్రవారం బోధన్ పట్టణానికి విచ్చేసిన ఎంఐఎం అధినేతను నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలపై ఎంఐఎం ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో మాట్లాడిస్తానని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాజ్ అలీ, కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, బాలకృష్ణ, ఎం.శ్రీనివాస్, దేవిదాస్ తదితరులున్నారు.

ఆర్మూర్‌లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లో శనివారం రాత్రి కమ్యూనిటి కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్, క్రైం బారిన పడిన వారు తక్షణమే 1930 కు డయాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని అన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. వాహనాలు నడుపుతూ మైనర్‌లు పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

పరారైన ఖైదీని పట్టుకున్న పోలీసులు

● అరెస్టు, రిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పారిపోయిన ఖైదీని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న ఖైది డబ్బులతో పరారీ అనే వార్తకు పోలీసులు స్పందించారు. జూన్ 30న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి పోలీసులు ముమ్మర గాలింపులు చేపట్టారు. ఎట్టకేలకు పరారైన ఖైదిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ జైలులో భార్యను చంపిన కేసులో ఖైది జీవన్ జీవిత ఖైది అనుభవిస్తున్నాడని పేర్కొన్నారు. వర్ని మండలం సైద్‌పూర్ గ్రామానికి చెందిన కాట్రోత్ జీవన్ గత 18నెలల నుండి పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడని తెలిపారు. జూన్ 29వ తేదిన పట్టణ శివారులోని జైలు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భారత్ పెట్రోల్ బంక్‌లో పనులు ముగించుకుని మధ్యాహ్నం 1:30గంటల సమయంలో పెట్రోల్ బంక్ నుండి బైక్‌పై పరారీ అయ్యాడని తెలిపారు. జైలు అధికారులు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పారిపోయిన ఖైదిని తిరుపతిలో ఉన్నాడన్న పకడ్బంది సమాచారం మేరకు బోధన్ పోలీసులు వెళ్లి చాకచక్యంగా తిరుపతి దేవస్థానం ఆవరణలో పట్టుకుని బోధన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. అనంతరం ఖైదిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నేటితో ముగిసిన ఎన్‌సీసీ క్యాడెట్ శిక్షణ



ముగింపు కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎడపల్లి,జూలై05(ఆంధ్రజ్యోతి):మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో 12వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో జూన్ 27 నుంచి జులై6 వరకు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పది రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసిందని క్యాంపు కమాండెంట్ లెఫ్ట్ కల్నల్ విష్ణుప్రసాద్ నాయర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పదిరోజుల శిక్షణ సమయంలో క్యాడెట్‌లను నాలుగు భాగాలుగా విభజించడం జరిగిందని,ఆల్ఫా,బ్రావో, చార్లీ, డెల్టాలుగా విభజించి ఫైరిం గ్, బెస్ట్ క్యాడెట్ ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతు లు అందించడం జరిగిందన్నారు. శిక్షణ శిబిరంలో 600 మంది క్యాడెట్‌లు పాల్గొన్నారని వీరికి వెపన్ ట్రైనింగ్, పర్సనల్ హైజీన్, మ్యాప్ రీడింగ్, ఎఫ్‌సీబీసీ,డ్రిల్ మొదలగు వాటిపై శిక్షణ ఇవ్వడం జరిగింద న్నారు. ముగింపు కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయన్నారు. ఈ పది రోజుల్లో నేర్చుకున్న విషయాలపై సబ్జెక్టు పరంగా సర్టిఫికేట్ పరీక్షల్లో రాణించాలని, త్వరలో రిపబ్లిక్ డే సెలక్షన్స్ జరుగుతా యని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. యువత ముఖ్యంగా ఎన్‌సీసీ క్యాడెట్ క్రమ శిక్షణతో నడుచుకుని దేశా నికి ఉపయోగ పడే పౌరులుగా ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్ర మంలో 12వ బెటాలియన్, ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎన్‌సీసీ అధికారులు ఉన్నారు.

మండలంలో మూడు డెంగ్యూ కేసులు నమోదు

కోటగిరి,జూలై5(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలో మూడు డెంగ్యూ కేసులు నమోదైనట్లు ఎంపీవో చందర్ తెలిపారు. కోటగిరి మండల కేంద్రంలో ఇద్దరు, కొత్తపల్లిలో ఒకరు డెంగీ బారిన పడినట్లు ఆయన తెలిపారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ముగ్గురు బోధన్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ నిర్ధారణ అయినట్లు ఎంపీవో తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పిస్తామని ఎంపీవో తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు



నందిని



రచన



పీవీ అస్మిత



చరణ్ తేజ్



అశ్వంత్



ముస్కాన్

వేల్పూర్ , జూలై5 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం శివాజీ తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఎం. రచన,శివాణీ, డి. నందినిలు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం శివాజీతో పాటు ఉపాధ్యాయులు అభినం దించారు.

ఆలూర్: ఆలూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ఆలూర్ పాఠశాల నుంచి 10మంది, కల్లెడ నుంచి ముగ్గురు, మిరాపల్లి పాఠశాల నుంచి ఇద్దరు, గుత్ప పాఠశాల నుంచి ఒకరు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

డొంకేశ్వర్:డొంకేశ్వర్ మండలం నుండి బాసర ట్రిబుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 41 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గతంలో కంటే ఎక్కువగా ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అత్యధికంగా డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల నుండి 26 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. తొండకుర్ ప్రభుత్వ పాఠశాల నుంచ 9 మంది, నికల్పూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి 5గురు, గాదెపల్లి పాఠశాల నుంచి 1 విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

మాక్లూర్:మండలంలోని గుత్ప గ్రామంలోని సీపీఆర్‌ఎం హైస్కూల్‌లో చదివిన విద్యార్థిని ఆదాంసాబ్ అనీసీ అనే విద్యార్థిని బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాలకరస్పాండెంట్ నిత్యానందం తెలిపారు.ఈసందర్భం గా కరస్పాండెంట్‌తో పాటు పాఠశాలసిబ్బంది శనివారం ఆమెకు శాలు వ కప్పి సత్కరించారు.ఈకార్యక్రమంలో సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రభుత్వ పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి 15 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి బాసర ట్రిపుల్ ఐటీలో శుక్రవారం వెలువడిన ప్రవేశాలలో ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థినిలు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినిలను అభినందించారు.

నవీపేట: బాసర ట్రిబుల్ ఐటీలో ప్రవేశానికి 8మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో అశోక్ తెలిపారు. జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్‌కు చెందిన కే.శివరాణి, నిరోష, బీ.తేజశ్విని, సీహెచ్ మణి దీక్షిత, జడ్పీహెచ్‌ఎస్ బినోలకు చెందిన కన్నం భవాని, కే.సింధూష, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌జేసీ నవీపేటకు చెందిన ఎం.లావణ్యలు ఎంపికయ్యారని ఎంఈవో పేర్కొన్నారు.

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పీవి అస్మిత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించుకుందని పాఠశాల పీఈటీ సిందూజ తెలిపారు. ఈ సందర్భంగా అస్మితను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

బోధన్‌రూరల్: ఆర్‌జేయూకేటీ ట్రిబుల్ ఐటీ బాసర ప్రవేశాల కొరకు శుక్రవారం వెలువడిన ఫలితాలలో సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ విద్యార్థి చరణ్ తేజ్ ఎంపికయ్యారు. ట్రిబుల్ బాసరలో సీటు సాధించిన విద్యార్థి చరణ్ తేజ్ పాఠశాల కరస్పాండెంట్ లతారాజు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష ఫలితాలలో చరణ్ తేజ్ 600మార్కులకు గాను 582మార్కులు సాధించాడని పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో 120మార్కులకు గాను 108మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 249వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారన్నారు. ట్రిబుల్ ఐటీలో తమ విద్యార్థి సీటు సాధించడం అభినందనీయమని విద్యార్థితో పాటు తల్లిదండ్రులకు కూడా అభినందించారు.

రెంజల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అశ్వంత్, ముస్కాన్‌లు బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించి బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం అభినందనీయమని విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందానికి ఎంఈవో ఆంజనేయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, తపస్ మండల అధ్యక్షులు అరుణ్, ఉపాధ్యాయులు భూమయప్ప, సుధాకర్, గంగాధర్, శేఖర్, నరేందర్, ముత్తయ్య, కమర్ ఉన్నీసా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

వేధింపులను భరించలేక భర్తను హతమార్చిన భార్య

● మినార్‌పల్లిలో దారుణ ఘటన

బోధన్‌రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. భర్తను కట్టుకున్న భార్యనే అతి కిరాతంగా హత్య చేసింది. భర్త నిత్యం వేధింపులు పెట్టేవాడని భరించలేకే పదునైన గడ్డపారతో శుక్రవారం అర్ధరాత్రి పొడిచి చంపడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ ఘటనపై బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మృతి చెందిన దేశ్యానాయక్(57) భార్య సాలుబాయి శుక్రవారం రాత్రి భార్యభర్తల మధ్య వివాదం నెలకొందన్నారు. .మాట మాట పెరగడంతో సాలుబాయి పక్కనే ఉన్న పదునైన గడ్డపారతో శరీరం, తలపై, మర్మాంగాలపై ఇష్టం వచ్చినట్లు పొడవడంతో తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా అరుపులు విన్న స్థానిక కాలనీవాసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారన్నారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.మృతుడు దేశ్యానాయక్ ఎటువంటి పని చేయకుండా చెడు అటవాట్లకు, మద్యానికి బానిసై నిత్యం భార్య సాలుబాయిని వేధిస్తూ ఉండేవాడన్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడని పేర్కొన్నారు. కూతుర్లు సంగీత, అనిత, సునీతలకు వివాహమై వారి ఇళ్లలో ఉంటున్నారన్నారు. కొడుకు వసంత్ ఇంట్లోనే ఉంటాడని ఎస్ఐ వివరించారు. ఇరువురి మధ్య తరుచు గొడవలు జరగడంతో విసిగిపోయిన భార్య సాలుబాయి శుక్రవారం ఈ దారుణ హత్యకు పాల్పడిందన్నారు. దేశ్యానాయక్‌ను హతమార్చిన భార్య సాలుబాయిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నామన్నారు. హత్య ఏ కోణంలో జరిగింది, ఏ విధంగా జరిగింది, ఇంకా ఎవరైనా హస్తం ఉందా తదితర అంశాలపై విచారిస్తున్నామన్నారు. మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. ఘటన స్థలాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు పరిశీలించారు.



దేశ్యానాయక్(ఫైల్)

● గ్రామంలో విషాదఛాయలు

బోధన్ మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో శుక్రవారం విషాద చాయలు అలుముకున్నాయి. నిత్యం అందరితో కలిసిమెలిసి ఉండే దేశ్యానాయక్‌ను భార్య గొంతుకోసి చంపడం దారుణమన్నారు. మృతుడి కూతుర్లు, బంధువులు తండ్రి మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి. ఎలాంటి హత్య ఘటన మినార్‌పల్లిలో చోటు చేసుకోవడం దారుణమన్నారు. హత్యకు గల కారణాలను పూర్తి స్థాయిలో అన్వేషించాలని కోరారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మాక్లూర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్ స్కూల్ నందు విద్యార్థులకు శనివారం సైబర్ నేరాల గురించి మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ అవగాహన కల్పించారు. షీటీం. మహిళలు, బాలికలపై జరిగే సైబర్ నేరాల గురించి యాంటి ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, ఇంచార్జి ప్రిన్సిపాల్ సరళ, సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో మట్కారాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ముగ్గురు మట్కా రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆన్‌లైన్ ద్వారా మహరాష్ట్రకు చెందిన గోల్ అనే వ్యక్తితో మట్కా ఆడుతున్న ఎజాస్, అబిద్, జాకీర్ హుస్సైన్‌లను పట్టుకుని వారి వద్దనుంచి రూ. 6వేల నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వా.దీనపరుచుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కోటగిరి,జూలై5(ఆంధ్రజ్యోతి):పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామానికి చెందిన మహదేవి(28)అనే వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్సైసునీల్ తెలిపారు. మహదేవికి కొడిచర్లకి చెందిన సుధాకర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది.కొద్దిరోజుల క్రితం ఆమెగర్బంతో ఉన్నప్పుడు నాలుగు నెలలో శిశువు ఆరోగ్యం సరిగ్గా లేక అబార్షన్ అయింది. ఈసంఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన మహదేవి శుక్రవారం రాత్రిఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి తండ్రిశింగారే స్మారూట్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్యాక్టరీ గేటు ఎదుట నిరసన

బోధన్‌రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట శనివారం కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలతో పాటు సర్వీస్ ఉన్నంత వరకు సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంపై అవగాహన

రెంజల్,జూలై5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాగేపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. గ్రామంలోని చెరువు కట్ట వద్ద గ్రామస్థులతో కలిసి 2వేల ఈత మొక్కలను నాటడం జరిగిందని ఎక్సైజ్ ఎస్సై షేక్ జలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు సాయిబాబాగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం జీపీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు మొక్కలు నాటడం వాటిని కాపాడటం అదే విధంగా ఆరోగ్యానికి ఉపయోగపడే మొక్కలు గురించి వాటి ఉపయోగం వివరించి నాటే పద్ధతులు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అంబర్ సింగ్, అటవీశాఖ వర్ని రేంజ్ అధికారి గంగాధర్, సెక్షన్ అధికారి కోటేష్ జాదవ్, బీట్ అధికారి హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్, రాజశేఖర్, భూమేష్, సౌమ్య, మహేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ

నకిలీ గడ్డి మందుతో వందల ఎకరాల్లో ఎండిన సోయాపంటలు



కమ్మర్‌పల్లిలో గడ్డి మందు డబ్బాలతో ఆందోళనకు దిగిన బాధిత రైతులు

కమ్మర్‌పల్లి,జూలై 5(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఎరువులడీలర్ వద్ద కొనుగోలు చేసిన గడ్డి మందు పనిచేయకపోగా కమ్మర్‌పల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాలలో గడ్డిమందుల వాడిన రైతులకు చెందిన వందలాది ఎకరాల్లో సోయాపంట మాడిపోయిందని బాధితరైతులు శనివారం ఎరువుల దుకాణంముందు గడ్డిమందు డబ్బాలతో ధర్నాకు దిగారు. గత15 రోజుల క్రితం మండలంలోని వివిధ గ్రామాల రైతులకు రెండు కంపెనీలకు చెందిన వివిధ రకాల గడ్డిమందులు విక్రయించాడని వీటిని కలిపి పిచికారిచేయాలని సూచించడంతో రైతులు అదేపద్దతిన చల్లామని కొండనాలుకకు మందువేస్తే ఉన్ననాలుక ఊడిదన్నచందంగా గడ్డి చావలేదు కాని గడ్డిమందు చల్లితే వందల ఎకరాల్లో సోయాపంట మాడిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఈదేంటని ప్రశ్నించిన ఉప్లూర్ గ్రామ రైతుల పంటలను పరిశీలించి ఎకరాన 11 వేల 5వందలు నష్టపరిహారం ఇవ్వడానికి షరతులతో ముందుకువచ్చాడని కాని డీలర్‌వద్ద కొనుగోలు చేసిన హసాకొత్తూర్, కమ్మర్‌పల్లి గ్రామాతో పాటు జగిత్యాల జిల్లా డబ్బా, అమ్మక్కపేట తదితర గ్రామాల రైతులు నష్టపరిహారం చెల్లించాలని శనివారం జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయమై ఫోన్‌లో మండల వ్యవసాయాధికారికి సమాచారం అందించారు. ఈ విషయమై అటు పోలీసులకు, ఇటు వ్యవసాయాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అవారి శుభాష్, పడిగెల ప్రవీన్, గడ్డం శ్రీధర్, ఫుప్పాల శ్రీధర్, గజేందర్, సుంకెట రఘుపతితో పాటు వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులు ధర్నాలో పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులకు అస్వస్థత

● ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రుద్రూరు,జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం(ఆర్) గ్రామ శివారులో గల మోడల్ కళాశాల వసతి గృహంలో 8మంది విద్యార్థినులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థినులను వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వసతి గృహ ఏఎన్‌ఎం విద్యార్థినులకు భోజనం చేయకముందు ఐరన్ మాత్రలు వేసుకోమని ఇచ్చారని, దీని మూలంగానే విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయిందని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్ప తెలిపారు. ఏఎన్‌ఎం నిర్లక్ష్యం మూలంగా విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డీఈవో వెంటనే స్పందించి ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు బైరాపూర్ రవీందర్ గౌడ్, పుట్ట భాస్కర్ కోరారు.

తల్వేద,కంఠం రోడ్ల వెడల్పునకు నిధుల మంజూరు కోసం వినతి



హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షులు మహేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంఠం, తల్వేద ఆర్ అండ్‌బీ రోడ్ల వెడల్పుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సీనియర్ నాయకులు పొద్దుటూరి పూర్ణచందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సింగిల్ లైన్ రోడ్లతో ప్రతీ రోజు ప్రమాదాలు జరిగి, ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కోన్నారు. అందుకోసం డబుల్ లైన్ రోడ్ల నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పంట పొలాల్లో రైతుల సౌకర్యార్థం మొరం రోడ్లు వేయాలని అందుకోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పిప్పెర సాయరెడ్డి, సీనియర్ నాయకులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

తొర్లికొండలో ఘనంగా స్వామివారి పల్లకీ సేవా

జక్రాన్‌పల్లి , జూలై5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వర్ స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. అనంతరం ఆలయంలో గ్రామస్థులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్ గౌడ్, ఆలయ కమిటి సభ్యులు, విడిసి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తమిళనాడు రైతు దినోత్సవానికి హాజరైన కోటపాటి

ఆర్మూర్‌రూరల్ , జూలై5 (ఆంధ్రజ్యోతి): తమిళ నాడులోని క్రిష్ణగిరి జిల్లా కేం ద్రంలో శనివారం నిర్వహించిన తమిళనాడు రైతు దినోత్సవానికి దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను సంఘటితం చేస్తు పసుపు బోర్డు సాధించడానికి ఇరవై ఏళ్లు ఉద్యమించి ఎట్టకేలకు నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపుబోర్డు సాధిం చుకున్నామని అన్నారు. దేశంలోని 20 రాష్ట్రాలలో పసుపుసాగు చేస్తు న్నారని ఆయన తెలిపారు. తమిళనాడులో పసుపు బోర్డు ప్రాంతీయ కార్యాల యం ఏర్పాటు చేయాలని ఇటీవల కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాను కలిసి విన్నవించానన్నారు.సమావేశంలో రామగౌండర్, వెంకటేష్, వేణు, హన్మంత్ రాజ్, అశోక్ కుమార్, శుబ్రమణ్యంరెడ్డి, వేలాదిగా రైతులు పాల్గొన్నారన్నారు.

కేజీవీల్ ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి

నందిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాపూర్ గ్రామ శివారులో అవుట్ల నరేష్(39) అనే యువకుడు కేజీవీల్ ట్రాక్టర్ కిందపడి మృతి చెందినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వన్నెల్(కె) గ్రామానికి చెందిన అల్లూరి ప్రదీప్ రెడ్డి వ్యవసాయ పొలంలో కేజీవీల్ ట్రాక్టర్ బురదలో కూరుకుపోయింది. దాన్ని తీసే క్రమంలో ముందట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో దాని పైన ఉన్న నరేష్ పొలం బురదలో పడిపోయాడు. ఆయన పై నుంచి కేజీవీల్ ట్రాక్టర్ వెళ్లడంతో నరేష్ అక్కడే మృతి చెందాడు. మృతుడు డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన వాడని, ఆయన భార్య అవుట్ల పుష్పా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

భీమ్‌గల్, జూలై5 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింహస్వామి, పల్లె శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అంతేకాకుండా అనేక వ్యాధుల బారీన పడి వారు ఇబ్బందులకు గురికాకుండా తల్లిదండ్రులకు కూడా క్షోభను కలిగిస్తున్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: యువత మాదక ద్రవాల్యల నుంచి దూరంగా ఉండాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మన్‌పల్లి గ్రామ పరిధిలో గల గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

ముప్కాల్ , జూలై5 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్ పామ్ సాగుచేయడం వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని బాల్కొండ డివిజన్ ఉద్యానవన అధికారి రుద్ర వినాయక్ సూచించారు. శనివారం ముప్కాల్ మండలంలోని నాగంపేట్‌లో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్ పాం కంపెనీ ప్రతినిధులుసాయికిరణ్,రాజేందర్,రైతులురాజేశ్వర్,రాజు,ప్రవీణ్ ఉన్నారు.

భీమ్‌గల్‌లో జగన్నాథ రథయాత్ర

భీమ్‌గల్ , జూలై5 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో జగన్నాథుని రథయాత్ర శనివారం నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై జగన్నాథుని ఆసీనులను చేసి బడా భీమ్‌గల్ చౌరస్తా నుంచి పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర నిర్వహించారు. హరి భక్తుల ప్రత్యేక భజనలతో కొనసాగింది.

ఎరువుల గోదాముల తనిఖీ

నవీపేట,జూలై5(ఆంధ్రజ్యోతి): నవీపేట సోసైటీ పరిధిలోని అబ్బాపూర్(ఎం), పోతంగల్, అభంగపట్నం, నవీపేటలలోని ఎరువుల గోదాములను శనివారం ఏవో నవీన్ కుమార్ తనిఖీ చేశారు. ఎరువులను ఈపాస్ యంత్రం ద్వారా పంపిణీ చేయాలని, పంటకు అవసరమైన మేరకు ఎరువులను అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 50శాతం వరకు వరి నాట్లు పూర్తయ్యాయని ఏవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చక్రధర్, రాహుల్, విజయ్, వంశీ తదితరులున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్ టౌన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేశాయి బీడీ కంపెనీలో తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యూనియాన్ ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి నజీర్, తుర్పాటి శ్రీనివాస్, నిమ్మల నికిల్, గంగాధర్, రవి, రాజేశ్వర్, రా జేందర్, వినయ్, విక్రం, రమేష్, అశోక్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఆర్మూర్ రూరల్, జూలై5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బీడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో లావణ్య, కౌసల్య, లక్ష్మీ, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం

● రైతు వేదికల నిర్మాణాలను చూసి నివ్వెరపోతున్న రైతులు ● కామారెడ్డి జిల్లాలో 80 శాతం భవనాలు నిరుపయోగమే..


ధర్మారావుపేట్ రైతువేదిక పరిస్థితి

సదాశివనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనార్థం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదికలు మూడు నెలల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో రైతుల శ్రేయస్సు కోరుతూ రైతులందరూ కలిసి పంటలపై చర్చించుకోవడానికి అధికారుల సలహాలు, సూచనలు పొందడానికి అనువుగా స్థలం ఉండాలన్నా ఉద్దేశం తో రైతు వేదికలు నిర్మించడం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో స్థలం అనువుగా లేకపోయినప్పటికీ నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతో ఏదో ఒక చోట ప్రజలకు అందుబాటులో లేకపోయిన ప్రయోజనం లేకుండా పోతున్నాయి. కొన్ని ప్రాంతాలలో నిర్మించిన రైతు వేదికలె నిర్మాణ సమయంలో అధికారులు పట్టించుకోకపోవడం. నిర్దేశించిన గడువు సమయంలో నిర్మాణం పూర్తి కావాలన్నా ఒత్తిడితో కాంట్రాక్టర్లు అదే అదునుగా తీసకుని నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతో కొన్ని రైతువేదికల వద్దకు రైతులు వెళ్లడానికి భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి ఇందుకు నిదర్శనం సదాశివనగర్ మండలంలోని ధర్మారావేపేట్ రైతు వేదికను చూపవచ్చు.

కామారెడ్డి జిల్లాలో రైతు వేదికల నిర్మాణం

కామారెడ్డి జిల్లాలో 102 రైతువేదికలే నిర్మించగా ఒక్కో రైతువేదికకు కూ.22లక్షల వ్యయాన్ని ఖర్చు చేశారు. అన్నిరైతు వేదికలు నిర్మించినప్పటికీ జిల్లాలో రైతులు ఇతర అధికార కార్యక్రమాలు నిర్వహించడానికి 20శాతం మాత్రమే ప్రస్తుతం ఉపయోగపడుతున్నాయి అనేది వాస్తవం. రూ.22లక్షల వ్యయం ఖర్చు చేయడంపైఅధికారులకు పై స్థాయి నుంచి కింది స్థాయి అధికార యంత్రాంగానికి వాటాలు ఇవ్వాల్సి రావడంతో కాంట్రాక్టర్లు పూర్తిగా నాసిరకం సరుకులను వాడటంతో నిర్మించిన మున్నాళ్లకే శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు ఈ రైతు వేదికలోకి వెళ్లాలంటే భయంతో వణుకుతున్నారు.

రైతు వేదికలో కల్పించాల్సిన వసతులు.. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు ఇలా..

రూ.22లక్షల వ్యయంలో అన్నిహంగులతో రైతు వేదికలె నిర్మించాలన్నది గత ప్రభుత్వ ఆలోచన. నీటి వసతి, మరుగుదొడ్లు, చెట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ సౌకర్యం, పరిసరాలలో పచ్చదనం, రైతులకు సరిపడా కుర్చీల ఏర్పాటు అన్నది రైతు వేదికల నిర్మాణ లక్ష్యాలు. 80శాతం రైతువేదికలు గ్రామానికి దూరం ప్రాంతం రైతులకు అందుబాటులో లేకుండా నిర్మించడంతో రైతులు వెళ్లకపోవడానికి ప్రధాన కారణం. నిర్మించిన రైతువేదికల వద్ద మరుగుదొడ్లు, నీటి వసతి పూర్తిగా గాలికి వదిలేయడంతో ఏదైనా కార్యక్రమానికి వెళ్లాల్సి వచ్చినప్పుడు వసతులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. రైతు వేదిక చుట్టూ వాకింగ్ ట్రాక్ సరిగా నిర్మించక పోవడంతో వేసిన బెడ్ కుంగిపోవడం, టైల్స్ విచ్చలవిడిగా కుంగిపోవడం, వాటి కింద పాములు, తేళ్లు దర్శన మివ్వడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళా విస్తీర్ణ అధికారులు పనిచేయాల్సిన చోట వసతులు లేకపోవడం, అటవీప్రాంతాన్ని తలపిస్తుండటంతో రక్షణ లేక గ్రామాల్లోనే రైతులను కలిసి సమాచారం అందించే పరిస్థితి దాపురిస్తుంది.

వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన మిస్ ప్రయోజనమే

రైతులకు వ్యవసాయంపై సూచనలు పలు కార్యక్రమాలు నిర్వహించడానికి అవగాహన కోసం రైతు వేదికలో విడియో కాన్ఫరెన్స్ సిస్టం ఏర్పాటు చేయడంతో వాటి నిర్వహణ వ్యవసాయ విస్తీర్ణాధికారులకు కత్తి మీద సాములామారింది. రక్షణ లేనిస్థలంలో లక్షల రూపాలయల పెట్టుబడితో వీసీ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో ఇటీవల సదాశజివనగర్ ఉత్తునూర్‌లో రక్షణ లేక వీసీ సిస్టమ్ దొంగిలించడం జరి గిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతీ మంగళవారం వీసీ నిర్వహణ కార్యక్రమం ఉండటంతో రైతు వేదికలకు అటెండర్లు లేకపోవడంతో అధికారులే కుర్చీలు వేసుకోవడం, శుభ్రం చేసుకోవడం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అందుబాటులో లేని ప్రాంతాల్లో నిర్మించడంతో రైతులు కూడా వీసీ ఉపయోగించుకోవడానికి ముందుకు రావడం లేదనేది పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫోకస్


రైతు వేదికలోని టాయిలెట్ల దుస్థితి ఇలా..


ప్రధాన గేటు ముందు పరిస్థితి


రైతు వేదిక భవన నిర్మాణంలో పగుళ్లు ఏర్పడిన దృశ్యం

ప్రతీ రైతు వేదికకు అటెండర్‌ను నియమించి వసతులు కల్పించాలి

- ఎర్రవాటి గంగారెడ్డి, రైతు పద్మాజీవాడి



నిర్మించిన ప్రతీ రైతు వేదికకు ఒక్కో అటెండర్‌ను నియమించి రైతు వేదికలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. రైతు వేదికల రక్షణపై దృష్టి సారించి వీసీ కార్యక్రమాన్ని నిరంతరం అందేవిధంగా అధికారులు కృషి చేయాలి. రైతువేదికలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి రైతు వేదికలను సత్వరమే మరమ్మ తులు చేపట్టి బాగు చేయాలి.


డోంగ్లి మండల కేంద్రంలో జలమయంగా మారిన గుంతలు

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారులు

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మద్నూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలంలో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడిన చిత్తడిగా మారుతుంది. రహదారులపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గుంతలు పూడ్చి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు డోంగ్లి నుంచి జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయం భయంగా వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. డోంగ్లి మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరు ప్రధాన రహదారి పైకి రావడంతో గుంతలుగా మారి రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గుంతలు గమనించకపోవడంతో వాహన దారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా, గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు నిధులు కేటాయించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో రోడ్లన్నీ బాగు పడ తాయని ప్రజలు భావిస్తున్నారు. డోంగ్లి మండలం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడంతో రోడ్డుపై గుంతలు పడి ప్రజలు గుంతల్లో పడిపోతున్నారు. ఇప్పటికైనా అధి కారులు, నాయకులు స్పందించి రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చడానికి నిధులు విడుదలయ్యే విధంగా కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కుర్ల చిచ్చుండ వెళ్లే దారిలో ఏర్పడ్డ గుంతలు

ప్లాస్టిక్‌పై నిషేధం ఏదీ?

● పలు దుకాణాల్లో బ్యాన్ చేసిన సింగిల్ యూజ్ కవర్లను గుర్తించిన అధికారులు ● పూర్తిస్థాయిలో నిషేధం అమలు జరిగేనా..!?

కామారెడ్డిటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం తప్పనిసరిగా మారింది. టన్నుల కొద్దీ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా గతంలోనే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గత రెండేళ్ల కిందట నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. దీంతో జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, కామారెడ్డి మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయితీలలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు సైతం చేపట్టి పలు హోల్‌సేల్ దుకాణాలు, వ్యాపార సముదాయాలపై దాడులు చేసి సింగిల్‌యూజ్ కవర్లను, బ్యాగులను పట్టుకుని భారీ జరిమానాలు విధించారు. ప్రస్తుతం అటువైపు కన్నెతి చూడక పోవడంతో మళ్లీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను అమ్మకాలు జరుపుతూనే ఉన్నారు. దీంతో కేంద్రప్రభుత్వం ఆదేశాలు ఎక్కడ కూడా అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం సైతం 100 రోజుల ప్రణాళికలో భా గంగా అశోక్‌నగర్ ఏరియాలో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టగా కమిషనర్ రాజేందర్‌రెడ్డి సింగిల్ యూజ్ కవర్లను గుర్తించారు.



శనివారం సింగిల్ యూజ్ కవర్లను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

కామారెడ్డిలో విచ్చలవిడిగా అమ్మకాలు

కామారెడ్డి పట్టణంలోని 49 వార్డుల్లో దాదాపు లక్షన్నర వరకు జనాభా ఉంటుంది. జిల్లాలోని పలు మండలాలకు పారిశ్రామికంగా కామారెడ్డి పట్టణమే పెద్ద దిక్కుగా ఉంది. ఇక్కడి నుండి వివిధ వస్తువులు గ్రామాలకు సరాఫరా అవుతుంటాయి. వివిధ మండలాల నుంచి వ్యాపారులు ఇక్కడి నుంచే కావాల్సిన సామగ్రి కొనుగోలు చేస్తారు. దీంతో ప్లాస్టిక్ వస్తువుల హోల్‌సేల్ దుకాణాలు అధికంగానే ఉన్నాయి. ఇక్కడి హోల్‌సేల్ దుకాణాలనుంచే గ్రామాలకు అవసరమైన ప్లాస్టిక్ వస్తువులు సరాఫరా అవుతాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి దుకాణాలపై గట్టి నిఘా ఉంచితే జిల్లాలో సగానికి సగం ప్లాస్టిక్ నిషేధం సులభమవుతుందనే అధికారులు ఆలోచన చేశారు. వీటితో పాటు టిఫిన్ సెంటర్లు, బట్టలషాపులు, కిరాణ దుకాణాల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు వినియోగించడంపై ఆ సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించి దాడులు చేశారు. దీంతో కొన్ని నెలల పాటు ప్లాస్టిక్ కవర్ల వినియోగంను తగ్గించారు. ప్రస్తుతం ఆ రకమైన దాడులు ఎక్కడ లేకపోవడంతో మళ్లీ ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతునే ఉన్నాయి.

సింగిల్ యూజ్ వస్తువులపై నిషేధం

ప్రతీ రోజు వాడే స్ట్రాలు, ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్లు, బ్యాగులు, ప్లేట్లు, కప్పులు, ప్యాకింగ్ కవర్లు తదితర సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కిందికి వస్తాయి. వీటి వాడకాన్ని తగ్గించేందుకు నిషేదం సైతం ఉన్న అమలుకు మాత్రం నోచు కోవడం లేదు. ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దుచేసే అధికారం ఉంటుంది. అలాగే విచ్చలవిడిగా వినియోగించే వారికి భారీ మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉంది. ప్లాస్టిక్‌ను ఎక్కువగా వినియోగించే టిఫిన్ సెంటర్లు, చికెన్, మటన్ లాంటి మాంసం దుకాణాలు, కురగాయల వ్యాపారులు, కిరాణ దుకాణాలు, హోటళ్లు, శుభకార్యాలకు సంబంధించి ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్పూన్ల వంటివి విక్రయించే దుకాణాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూర్తిస్థాయిలో నిషేధం అమలు జరిగేనా..!?

మున్సిపాలిటిలలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న ప్లాస్టిక్ కవర్లను వాడితే అధికారులు భారీగా జరిమానాలు విధించాల్సి ఉంటుంది.దుకాణాల్లో దొరికితే రూ.2500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్‌ను వినియోగిస్తూ పట్టుబడినవారికి రూ.250 నుంచి 500 వరకు జరిమానా విధిస్తారు. పండగలు, ఇతర శుభకార్యాల్లో నిషేదిత ప్లాస్టిక్ వాడుతూ దొరికితే రూ.50 వేలవరకు జరిమానా వేస్తారు. ప్రతీ పౌరుడు ప్లాస్టిక్ నిషేదంపై స్వచ్ఛందగా ముందుకు రావాలని, ప్రతీ ఇంట్లో వివిధ అవసరాలకు వినియోగించేలా నూలు, జనపనార సంచులు కొనుగోలు చేయాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు విధిగా బట్టసంచులు వెంట తీసుకుపోతూ ప్లాస్టిక్ భూతాన్ని తరమి కొట్టేందుకు సహకరించాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేదం అమలుపై మాత్రం దృష్టి సారించడం లేదు.

నేడు తొలి ఏకాదశి

● చాతుర్మాస వ్రతం ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హిందూ సాంప్ర దాయంలో అత్యంత పుణ్యప్రదాయినిగా తొలి ఏకాదశిని భావిస్తారు. తొలి ఏకాదశి పర్వదినాన స్వామికి ప్రీతికరమైంది కావడంతో ఉపవాసంతో పూ జించడం ప్రత్యేకంగా భావిస్తారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి హిందూ సాంప్రదాయంలో పండుగలు, పర్వదినాలు ప్రారంభమవుతాయి. ఆలయాల్లో స్వామికి విశేష పూజలు నిర్వహించి స్వామిని యోగ నిద్రలోనికి తీసుకెళ్తారని శాస్త్రం చెబుతుంది. స్వామి నాలుగు నెలల పాటు యోగనిద్రలో ఉండి భక్తుల పూజలు అందుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. యోగనిద్రలో ఉన్న స్వామికి నాలుగు నెలల పాటు దేవాలయాలతో పాటు పీఠాధిపతులు, సన్యాసులు, మునీశ్వరులు చాతుర్మాస వ్రతాన్ని పాటిస్తారు. పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తికి ఇచ్చిన హామీ మేరకు నాలుగు నెలల పాటు పాతాళ లోకంలో యోగనిద్రలో ఉంటారని భక్తులు భావిస్తారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు..

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. నాలుగు నెలల పాటు దేవతా మూర్తులు యోగనిద్రలో ఉండనుండటంతో ఏకాదశి రోజునే తులసీ, బిల్వ, వివిధ రకాల పుష్పాలతో పూజాది కార్యక్రమాలు జరుపనున్నారు. జిల్లా వ్యాప్తంగా వైష్ణవ క్షేత్రాలైన జెండా బాలాజీ మందిర్, భీంగల్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, బోధన్ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఖిల్లా రఘునాథ ఆలయం, ఆర్మూర్ వెంకటేశ్వర ఆలయం, డిచ్‌పల్లి రామాలయం, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వర ఆలయం, ఉత్తర తిరుపతి క్షేత్రం, సుభాష్‌నగర్ రామాలయం, నాందేవ్‌వాడ విఠలేశ్వర ఆలయం, బ్రహ్మపురి విఠలేశ్వర ఆలయం, నీలకంఠేశ్వర ఆలయం, శంభులింగేశ్వర ఆలయం, బోధన్ ఏకచక్రేశ్వర ఆలయాల్లో విశేష పూజలు జరుగనున్నాయి.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో వార్కారి సాంప్రదాయానికి సంబంధించిన భక్తులు అధికంగా ఉండడంతో ఆషాడ ఏకాదశి రోజు పండరీపూర్ వెళ్లి పాండు రంగనాథుని దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇక్కడి నుంచి పాదయాత్రతో పండరీపురం వరకు దిండి పేరుతో నెల రోజుల పాటు పాదయాత్ర నిర్వహించి ఆషాడ ఏకాదశి మహారాష్ట్రలోని పండరిపూర్‌కు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి

కమ్మర్‌పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా చదువుతో పాటు క్రీడల్లోను రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి అన్నారు. జాతీస్థాయి అండర్ 19 క్రికెట్ పోటీలకు కమ్మర్‌పల్లి మిసిమి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఉప్లూర్ గ్రామానికి చెందిన ఎనగందుల సౌమిత్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థిని అబినందించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలవ్వకుండా బాగా చదివి ఉత్తమ విద్యార్థులుగా, క్రీడల్లో పాల్గొని మంచి క్రీడాకారుడిగా స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కొడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో నిలిచిన నీరు


కోటగిరిలో పందుల సంచారం


కోటగిరిలో పూడికతో నిండిపోయిన మురికి కాలువ

వ్యాధుల కాలం.. అప్రమత్తతే కీలకం

కోటగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలనుగుణ వ్యాధులు ముసిరే సమయం ఆసన్నమైంది. జూలై నుండి మూడు మాసాలు చాలా కీలకమని వైద్యులు చెబుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని ఖాళీ స్థలాలు, కూలర్‌లలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. వానాకాలంలో మరింత అప్రమత్తత లేకపోతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే కోటగిరి ఉమ్మడి మండలంలో ఐదు డెంగ్యూ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

● గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

గ్రామాలలో పారిశుద్యం అస్తవ్యస్తంగా మారింది. మురికి కాలువల్లో పూడిక పేరుకుపోయి రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారి బురద గుంటలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శులు నిధుల లేమీతో పారిశుధ్య సమస్యలు పరిష్కరించేందుకు వెనుకాడే పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

● దోమలతో మలేరియా

వానాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ కేసులు పెరగనున్నాయి. జూన్‌లో మలేరియా నివారణ పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియాకు కారణమయ్యే దోమ మరుగునీటిలో పెరుగుతుంది. వర్షాకాలంలో గ్రామాలలో మురుగునీరంత మడుగుల్లో నిల్వ ఉండడం వల్ల దోమలు విజృంభించేందుకు కారణమవుతుంది.

● డెంగ్యూ నివారణ ముఖ్యం

జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. కోటగిరి మండలంలోనే గత జూన్ నెలలో రెండు కేసులు నమోదు కాగా జూలైలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. మండల కేంద్రంలోని పోలీస్ పక్కన ఓ ఇంటిలోని మహిళకు, బీసీ కాలనీలోని మరో మహిళకు, మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ యువకుడు డెంగ్యూ వ్యాధి బారిన పడ్డారు. గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ నీటి నిల్వ కారణంగా సమస్యలు తప్పడం లేదు. తాగి పడేసే కొబ్బరి బొండాలు, టీ కప్పులు, మురుగు నీటి నిల్వలు దోమలకు అనువుగా ఉంటున్నాయి. వీటిలో దోమలు వృద్ది చెంది డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి. దోమ కుట్టిన వెంటనే జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి.

● సాధారణ జ్వరంతో ఇక్కట్లు

వర్షాకాలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ జ్వరంతో బాధపడే వారే కనిపిస్తారు. వర్షాకాలంలో చాలా మంది జ్వరాల బారిన పడి ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు, వృద్దులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఫ్లూ జ్వరం వస్తుంది. జలుబు, దగ్గు, అనయం శరీరంలో శక్తిని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

● ఇలా చేస్తే మేలు

నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. దోమల లార్వాను నియంత్రించాలి. మురుగు కాల్వ పూడిక వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. మందుల పిచికారి చేపట్టాలి. ప్రధాన కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. వార్డుల వారిగా పారిశుధ్య చర్యలను చేపట్టాలి. వ్యాధులు ప్రబలే ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

● పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో



గ్రామాలలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పరిసరాల పరిశుభ్రతపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాము. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న నగరానికి చెందిన అబిబా కౌసర్‌కు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సీఎం సహాయనిధి ద్వారా రూ.4లక్షల విలువ గల చెక్కును అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే మొదటి కర్తవ్యం అని ఏ ఒక్కరిని ఆరోగ్య సమస్యలతో బాధపడనివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ పౌరునికి చేరవేయడమే తన లక్ష్యం అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన చికిత్సలకు ఆర్థికభారం కాకుండా సీఎం సహాయనిధి పథకాన్ని ఉపయోగించుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులున్నా సంప్రదించవచ్చని, తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

సుభాష్‌నగర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రైతులకు యూరియా దొరకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వానాకాలంలో సుమారు 4లక్షల 15వేల ఎకరాల్లో వరి పంట సాగు జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని పేర్కొన్నారు. ఈ సాగుకు 75వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 25వేల 500 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశారని తెలిపారు. మిగతా 50వేల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని, సొసైటీలు, డీలర్ల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారని గుర్తుచేశారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా యూరియా సరఫరా చేయాలని కోరారు. లేనిచో

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 39వ డివిజన్ గౌతంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు పోసి శనివారం భూమిపూజ చేశారు. డివిజన్‌కు చెందిన నాయకురాలు స్వప్న జాదవ్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నగర ఎస్టీసెల్ అధ్యక్షుడు సుభాష్ జాదవ్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల వసతి గృహంలోని సమస్యలను పరిష్కరించాలి: తెలంగాణ జాగృతి

ధర్పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో నిర్వహిస్తున్న వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. వసతిగృహంలోని డైనింగ్ హాల్‌లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, రాత్రి సమయంలో భోజనం చేయడం బాలికలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. వసతిగృహంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అన్నారు. వసతిగృహ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పేరుకుపోయాయని పాములు, విషపురుగుల వల్ల బాలికలకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. బాలికల వసతిగృహంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రూరల్ కన్వీనర్ రాము, రాహుల్, రవికాంత్, ప్రేమ్‌కుమార్, భానుప్రసాద్, శివ తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లికి చెందిన మెండె శ్రీతిక, సుద్దులంకి చెందిన హర్షిత్ రామ్‌రెడ్డి, నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మిట్టపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుశీల్‌కుమార్, సుద్దులం హెచ్‌ఎం గంగారాం తెలిపారు. అలాగే నాంపల్లి జ్యోతిబా పూలే విద్యార్థి మిట్టపల్లికి చెందిన విశ్వకర్మ తరుణ్ ఎంపికైనట్లు సుశీల్‌కుమార్ తెలిపారు.

ఇందల్వాయిలో ఒకరు..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వడ్ల జ్యోత్స్న బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు గ్రామసులు తెలిపారు. 2024-25 సంవత్సరంలో తిర్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలో మండల సెకండ్ ర్యాంక్ సాధించిన జ్యోత్స్నకు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు రావడం గర్వంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.

సిరికొండలో 11మంది..

సిరికొండ: మండలానికి చెందిన పదకొండు మంది విద్యార్థులు బాసర ట్రీపుల్ ఐటీ కళాశాలకు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదివిన ఏడు గురు విద్యార్థులు నిత్యశ్రీ, నందిని, హర్షిత, అక్షయ, బిందువర్ధిణి, స్నేహ, ప్రసన్నకుమార్, రామడుగు హైస్కూల్లో చదివిన నక్క శశిర, కొండపూర్ హైస్కూల్లో చదివిన మరో ముగ్గురు విద్యార్థులు బాసర ట్రీపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

బైకుపై నుంచి పడిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

నిజామాబాద్ అర్బన్, జూలై5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ బీపీ తక్కువై పక్షవాతం వచ్చి రోడ్డుపై పడి గాయాలపాలు కాగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాడు. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సంజీవ్ స్పందించి బైక్‌పై నుంచి పడిన వ్యక్తికి సపరియాలు చేసి అందుబాటులో ఉన్న ఆర్‌ఎంపీతో ప్రాథమిక వైద్యం చేయించాడు. ఆయన సూచనతో అంబులెన్స్‌ను పిలిపించి ఆసుపత్రికి పంపించారు. సంజీవ్‌ను స్థానికులు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ అభినందించారు.

సిరికొండలో రెండు కిరాణ దుకాణాల్లో చోరీ

సిరికొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రంలో రెండు కిరాణ దుకాణాల్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణాల్లోని నగదును ఎత్తుకెళ్లారని ఎస్సై రామ్ తెలిపారు. రవి కిరాణ దుకాణంలో ఫ్రిజ్ కోసం ఉంచిన రూ.20 వేల నగదు, జొరిగే అరుణ్ దుకాణంలో నుంచి సుమారు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు.

పశువైద్యశాల భవనానికి మరమ్మతులను చేపడుతాం: ఏఈ

ఇందల్వాయి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందల్వాయి గ్రామంలో పశువైద్యశాల భవనం మరమ్మతులను త్వరలోనే చేపడుతామని ఏఈ కిషన్ శనివారం తెలిపారు. ఇటీవలే కలెక్టర్ పశువైద్యశాలను సందర్శించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించగా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పశువైద్య శాలను ఏఈ కిషన్ పరిశీలించి 2లక్షల రూపాయలతో మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ కిషన్, వీడీసీ అధ్యక్షుడు జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసమే సమ్మె: సీపీఎం

నిజామాబాద్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసమే దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మెను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వివిధ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తోందని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసేంతవరకు సమ్మెతోపాటు ఇతరత్ర నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- బీఎల్‌వోల సమావేశంలో ఆర్డీవో రాజేంద్ర కుమార్

డిచ్‌పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా ఆర్డీవో రాజేందర్ కుమార్ ఆదేశించారు. డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన బీఎల్‌వోల సమావేశానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఓటర్‌ల నివాసం మార్పు, నమోదుల సవరణ, వంటి వివరాలను గ్రామస్థాయిలో బీఎల్‌వోలు నమోదు చేయాలని, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని తమకు ఇచ్చిన ఓటర్ దరఖాస్తు ఫారాలను అందజేయాలని ఆర్డీవో రాజేందర్ కుమార్ సూచించారు. ప్రతీ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ సంఖ్య, ఇ-మెయిల్ ఐడీ, నివాసపు వివరాలు, తప్పక పూర్తిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేందర్‌కుమార్


పాల్గొన్న బీఎల్‌వోలు

దివ్యాంగుల హక్కుల చట్టాల ప్రకారం వారి వివరాలు కూడా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇటీవలే సంతకం చేసిన వివరాలు కూడా ఫొటోగ్రఫీపై నమోదు చేసేలా చర్యలు తీసుకోవన్నారు. తహసీల్దార్ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ మల్లిఖార్జున, సాయికుమార్, ఆర్ఐ సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.


వర్ధంతి సభలో మాట్లాడుతున్న భూమయ్య

దొడ్డికొమురయ్య ఆశయాలను కొనసాగిద్దాం

మోపాల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు అమరుడు దొడ్డికొమురయ్య ఆశయాలను కొనసాగించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. శనివారం మండలంలోని ఠాణాకుర్దు గ్రామంలో దొడ్డికొమురయ్య ట్రస్ట్ భవన్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో దొడ్డికొమురయ్య 79వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాముల పటేల్, పట్వారి దోపిడికి, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూమి కోసం భుక్తి కోసం దేశ విముక్తి కోసం మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని అన్నారు. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో దొరల, భూస్వాముల భూములను 10లక్షల ఎకరాలను ప్రజలకు పంచారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల దగ్గర, ప్రజల దగ్గర ఉన్న భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఉన్న వనరులను పెట్టుబడి దారులకు అదాని, అంబానిలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రామంలో సమ్మెకు మద్దతుగా రైతాంగ సమస్యలను పరిష్కరించాలని రైతులు నిరసన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏ.రాజేశ్వర్, సాయాగౌడ్, రవీందర్, నర్సయ్య, వెంకటి, పరమేశ్, గంగారాం, సాయరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సిరికొండ ఎస్సైగా కళ్యాణి నియామకం

సిరికొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరికొండ ఎస్సైగా మామిడి కళ్యాణిని నియామిస్తూ నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. మామిడి కళ్యాణి ఎస్సై శిక్షణ పూర్తి కాగానే సిరికొండకు పోస్టింగ్ చేశారు. ఇంతకాలం ఎస్సైగా పనిచేసిన ఎల్.రామ్‌ను నిజామాబాద్ వీఆర్‌కు బదిలీచేశారు.

డిచ్‌పల్లికి చేరిన ఎన్నికల సామగ్రి

డిచ్‌పల్లి, జూలై5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఎన్నికలకు సంబంధించిన సామగ్రి శనివారం డిచ్‌పల్లి మండలానికి చేరుకుంది. మండల పరిషత్ కార్యాయంలో సామగ్రిని భద్రపరిచారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ అయిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులకు విదేశాలలో ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్జాలో గ్లాస్ వర్కర్ ఖాళీలు ఉన్నాయని, ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ అండ్ మెకానికల్ అర్హత కలిగిన వారు ఈనెల 9న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే నమోదు డ్రైవ్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెజ్యూమ్‌లను టామ్‌కామ్.రెజ్యూమ్.జీమెయిల్‌కు పంపాలని లేదా 9440049937 నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

మోపాల్ ఎస్సైగా సుమలత

మోపాల్, జూలై5 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉన్నతాధికారులు ఆయా మండలాల్లో ఉన్న ఎస్సైలను బదిలీ చేశారు. ఇందులో భాగంగా మోపాల్ ఎస్సైగా సుమలత బదిలీపై రానున్నారు. ఇక్కడున్న ఎస్సై యాదగిరి వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్సై రాగానే రిలీవ్ అవుతున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి మండలంలో ఎస్సైగా పనిచేసినందుకు గర్వంగా ఉందన్నారు. అందరి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఇప్పుడు వచ్చే నూతన ఎస్సైకి కూడా సహకారం అందించాలని కోరారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

నిజామాబాద్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రణాళిక రూపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుజాత సూర్యరాజ్, గౌరవ సలహాదారులు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు గంగాధర్, సుజాతరెడ్డి, సంతోష్ రెడ్డి, రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్

సుభాష్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని టీజీవో కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అలుక కిషన్ మాట్లాడుతూ టీజీవో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్న 180కోట్ల వైద్యబిల్లును చెల్లించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో నాయకులు, కార్మికులు

నిజామాబాద్‌కల్చరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న ప్రజసంఘాల పిలుపు మేరకు నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కార్మికసంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పూలాంగ్ చౌరస్తా, ఆర్‌ఆర్ చౌరస్తా, పెద్దబజార్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు సాగింది. బైక్ ర్యాలీ దారిపొడవున కార్మికులు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన సభ కు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, టీయూసీఐ జిల్లాఅధ్యక్షుడు నరేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌లు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, వ్యవసాయ కార్మిక సం ఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సందీప, స్వాతి, చక్రపాణి, హన్మాండ్లు, దేవేందర్, అనీల్, మురళి, రాజేశ్వర్, రవికిరణ్, మోహన్, మల్లికార్జున్, శంకర్, అన్వర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

(5వ పేజీ తరువాయి)

పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మూఢనమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై అవి అందరికి సమానం అనే విషయాన్ని అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా అంకితభావంతో పనిచేయాలని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పక్కాగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. కార్పొరేషన్‌ల ద్వారా వచ్చే పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురిచేసే వారిపట్ల కమీషన్ కఠిన చర్యలు చేపడుతుందని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్, ఏకరూప దుస్తులు అందేలా చూడాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న కమీషన్ చైర్మన్‌కు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యలు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. సమావేశం ప్రారంభంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి చైర్మన్, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రజిత, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూలాంగ్‌కు చెందిన మల్లెపూల సందీప్‌కుమార్ (36) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కార్పెంటర్ పనిచేసుకునే సందీప్ తన అన్నతో కలిసి షాపు పెట్టుకోగా అందులో అప్పులపాలయ్యాడు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నాననే మానసిక ఆందోళనతో శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సందీప్ బోర్గాం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లగా శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీజేపీ!

(5వ పేజీ తరువాయి)

పార్టీ నేతలు సమన్వయంతో పనిచేస్తూ గెలుపునకు వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లాలో అమిత్‌షా పర్యటన విజయవంతంతో ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని వారు అంచనాకు వస్తున్నారు. రిజర్వేషన్‌కు అనుకూలంగా పోటీచేసేలా నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్తబ్దుగా బీఆర్ఎస్?

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుండగా బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఎలాంటి కసరత్తును ప్రారంభించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలు కార్యక్రమాలు తగ్గిపోయాయి. గ్రామ, మండలస్థాయి నేతలకు అందుబాటులో ఉండడం లేదు. గత పదేళ్లుగా ఈ పార్టీకి చెందిన నేతలే సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, జిల్లాపరిషత్ చైర్మన్‌లుగా పనిచేశారు. మున్సిపాలిటీల్లోనూ ఎక్కువగా కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా, మున్సిపల్ మేయర్, చైర్మన్‌గా పనిచేశారు. ఆ నేతలు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంనేందుకు కిందిస్థాయి నేతలు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్, బీజేపీకి దీటుగా పోటీచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలతోపాటు మాజీ ఎమ్మెల్యేలు సహకరిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని అంచనాకు వస్తున్నారు. బాల్కొండ నియోజ కవర్గం మినహా ఎక్కడా పూర్తిస్థాయిలో కార్యక్రమాలు చేపట్టడంలేదు. మాజీ ఎమ్మెల్యేలు ఎక్కువగా హైదరాబాద్‌కు పరిమితం కాగా నియోజకవర్గాల్లో చురుకుగా కార్యకలాపాల్లో పాల్గొనేవారు కరువయ్యారు. రిజర్వేషన్ అనుకూలిస్తే పార్టీనుంచి పోటీకి సిద్ధమవుతున్న ఎక్కువ మంది నేతలు ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తే తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మెహర్‌బాబాకు పూజలు

నిజామాబాద్ కల్చరల్, జూలై5 (ఆంధ్రజ్యోతి): అవతార్ మెహర్‌బాబా మౌనదీక్షను చేపట్టి 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అవతార్ మెహర్‌బాబాకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జనార్ధన్‌రావు కాశీనాథ్ పవార్ మాట్లాడుతూ అవతార్ మెహర్‌బాబా దేశ విదేశాల్లో కేంద్రాలను స్థాపించి ఆధ్యాత్మిక చింతనను పెంపొందించారని అన్నారు. అనంతరం భక్తులు భజనలు, సంగీత విభావరి, ఆయన జీవిత చరిత్రపై నృత్య నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.210	రూ.260	రూ. 280
వెన్‌కాబ్ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,100	రూ.90,500	రూ.1180

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మెట్రో ఇన్ డినో (హిందీ) (10.10)
: సోలో బాయ్ (1.35)
: తమ్ముడు (4.25, 7.35, 10.45)
స్క్రీన్-2 : షో టైమ్ (10.05)
: కుబేరా (12.30, 4.10, 7.50, 10.40)
స్క్రీన్-3 : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (10.10, 1.00)
: కన్నప్ప (3.50, 10.45)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.30)
స్క్రీన్-4 : ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (10.20)
: 3బిహెచ్‌కె (1.35, 7.55)
: సితారే జమీన్ పర్ (హిందీ) (4.30)
: మెట్రో ఇన్ డినో (హిందీ) (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తమ్ముడు (1.40, 7.20, 10.20)
: 3బిహెచ్‌కె (4.35)
స్క్రీన్-2 : జురాసిక్ వరల్డ్ (తెలుగు 3డి) (11.00, 4.40, 10.30)
: కుబేరా (1.30, 7.20)
స్క్రీన్-3 : 3బిహెచ్‌కె (10.45, 7.40)
: కన్నప్ప (1.25, 10.35)
: కుబేరా (4.30)

దేవి : కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: తమ్ముడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్